# వారసత్వం

పార్కుకి వెళ్లిన సత్యనారాయణ, రవి ఇంకా తిరిగి రాలేదు. వంటపని పూర్తి చేసుకొని చావిట్లోకి వచ్చింది రాధ. రాజు, పద్మ సినిమాకి వెళ్లారు. ఒంటరిగా కూర్చున్న రాధ మనసు గతంలోకి పరుగులు తీసింది.

నలుగురు అన్నదమ్ముల మధ్య అపురూపంగా పుట్టి పెరిగిన రాధ వలచినా, ఏది తలచినా క్షణాల మీద కార్యరూపం దాల్చేది. తల్లిదండ్రులకి రాధంటే ప్రాణం. అన్నలకి తమ చిన్నారి చెల్లంటే ఎంతో అభిమానం. ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగిన ఆ కాలం రాధ జీవితంలో అనుకోని ఆరాటాన్ని నింపి పోతుందని ఆ ఇంట్లో ఎవ్వరూ కలలో అయినా ఊహించలేదు.

అన్నలు ఉద్యోగాల మీద దూరప్రాంతాలకి వెళ్ళిపోయారు. ప్రాణంకన్న మిన్నగా ప్రేమించిన తల్లిదండ్రులు పరమాత్ముని పిలుపు అందుకొని పరలోకం చేరుకొన్నారు. కాని ఆనాడు రాధ జీవితంలో అడుగుపెట్టిన సమస్య ఈనాటికీ పరిష్కారం లేకుండా అలాగే నిలిచిపోయింది.

గతస్మృతులు రాధని గదిలోకి లాక్కుపోయాయి. అప్రయత్నంగా చేతులు పెట్టి అడుగున భద్రపరచిన పాత డైరీలను పైకి తీసాయి. చిన్ననాటి చిలిపి ఊహలు, అన్నలతో తగవులు, అమ్మ దగ్గర అలుకలతో చాలా డైరీలు నిండిపోయాయి. ఆ జ్ఞాపకాలని తవ్వుకొని చిలిపిగా నవ్వుకొంది రాధ. వెలుగు అంచుల్లో నిలిచే చీకటిగా తల్లిదండ్రుల ఎడబాటు తలపుకి రావడంతో ఆమె కళ్లు చెమర్చాయి. కళ్లు తుడుచుకొని మరొక డైరీ చేతిలోకి తీసుకొంది రాధ.

కంపిస్తున్న వేళ్లతో మొదట సగం కాగితాలు చరచర తిప్పివేసింది. ఏప్రిల్ 12-1944 దగ్గర ఆమె చెయ్యి ఆగిపోయింది. టేబిలు లైటు వెలుగులో అక్కడ వ్రాసుకొన్న దాన్ని చదువసాగింది.

'మూడేళ్ల కిందట నారాయణ పెళ్లిలో సత్యనారాయణని చూసినమాట నిజమే! మగ పెళ్లివారి తరఫున వచ్చిన ఆ ఉంగరాలజుట్టు అబ్బాయి హుషారుగా విడిదిలోనూ, పెళ్లి పందిరిలోనూ తిరుగుతూ చాలామంది దృష్టిని ఆకర్షించాడు. రెండు, మూడుసార్లు ప్రత్యక్షంగాను, మరికొన్నిసార్లు పరోక్షంగాను అతని గురించి వచ్చిన సంభాషణలో తను పాల్గొనడం కూడా జరిగింది. ఆఖరి రోజున అనవసరంగా అతనితో ఏదో వాదన పెంచుకొంది తను. ఏది ఏమైనా సత్యనారాయణతో పరిచయం కలిగాక అతడు మంచివాడనే అభిప్రాయం మనసులో నిల్చిపోయింది. కాని అవసరం. అవకాశం రాని కారణంగా ఆ మంచి భావన మనోక్షేత్రంలో ఏ మూలో పడి మొలకెత్తకుండా అలాగే ఉండిపోయింది.'

రాధ డైరీలో తేదీని పరీక్షగా చూసింది. అవును, అదేరోజు, తను తప్పు చూడలేదు. కాగితాలు పాతబడ్డాయి. సిరా రంగు వెలిసిపోయింది. కాని మనసులోని జ్ఞాపకాలు పలుచబడలేదు.

ఏప్రిల్ నెల 12వ తేదీ 1944వ సంవత్సరం దగ్గర ఆమె చూపులు నిలిచాయి.

పెళ్లి కొడుకుల లిష్టులో పెన్సిలుతో టిక్కులు పెడుతున్న నాన్నగారు, "ఈ సత్య నారాయణ అంటే అప్పుడు నారాయణ పెళ్లిలో మగపెళ్లివారి తరపున వచ్చిన ఎర్రని కుర్రాడేనా?" అన్నారు.

అది స్వగతమో లేక ఎదురుగా కుర్చీలో కూర్చుని లేసు అల్లుకొంటున్న నన్ను ఉద్దేశించి అన్నారో నాకు తెలియదు. నేను మౌనంగా ఆ మాట విననట్లు, నా అల్లిక పనిలో నిమగ్నమై ఉన్నట్లు నటించాను. ఆ కాగితంలో ఆయనకి ఇంకే వివరాలు కన్పించాయో, "ఆ.... ఆ... అతడే" అన్నారు ఉత్సాహంగా.

"నువ్వూ చూసేవు కదూ రాధా! ఆ వెనుక కూడా ఒకసారి కొన్నాళ్లు ఈ ఊరిలోనే ఉన్నాడు. మన ఇంటికి కూడా ఒకసారి వచ్చేడనే జ్ఞాపకం. చూడగా ఇది మంచి సంబంధం లాగే ఉంది. నీకిష్టమైతే..."

నా చేతిలోని లేసుపుల్ల జారి నేల మీద పడి ఖంగున చప్పుడు అయింది. ఆ ధ్వనికి నాన్నగారు తలెత్తి కళ్లజోడు క్రింద నుండి ప్రశ్నార్థకంగా నా వైపు చూసారు. నేను తల వంచుకొని గబగబ గదిలోకి వెళ్లిపోయాను.

"నువ్వు ఆలోచించుకొని మీ అమ్మతో చెప్పు. నా మట్టుకి ఈ సంబంధం బాగుంది. అత్తా, ఆడుబిడ్డల పోరు ఉండదు. పిల్లాడు బి.యల్. పాసయేడు. బోర్డు కట్టుకుంటే బోలెడు సొమ్ము గడిస్తాడు...."

నాన్నగారి మాటలు గదిలోకి వెళ్లి తలుపు వేసుకొనే వరకూ వినిపిస్తూనే ఉన్నాయి.

ఏప్రిల్ 14, 1944 : మధ్యాహ్నం భోజనాలయేక అమ్మ పెళ్లి విషయం కదిపింది. "నాన్నగారు చెప్పిన విషయం ఆలోచించావా రాధా! నీ అభిప్రాయం ఏమిటి?" అంది.

"నాకిప్పటినుంచి పెళ్లి చేసుకోవాలని లేదమ్మా!" అన్నాను.

వయసొచ్చిన పిల్లల మనోగత అభిప్రాయాల్ని తల్లిదండ్రులు సులువుగానే గ్రహించు కోగలరు. నామాట వెనుక నిలచిన అర్థాన్ని తెలుసుకోలేనంత అమాయకురాలు కాదు అమ్మ. రాత్రి భోజనాల దగ్గర, "ఈ సంబంధం కాకపోతే ఇంకొకటి నీకిష్టమయితే చెప్పు" అన్నారు నాన్నగారు.

ఆనందంతో ఎగిరి గంతేసేను. కలలు ఫలించే కాలం కలిసి వచ్చిందని మురిసి పోయేను.

ఏప్రిల్-15 : అతడి మాట వినగానే నా ఆనందం అంతా ఆవిరి అయి ఆకాశం మీదికి ఎగిరిపోయింది. సర్వస్వం అనుకొన్న వ్యక్తి సమయం వచ్చేసరికి పిరికిపందలా ముఖం చాటుచేశాడు. అంతకాలంగా అన్ని ప్రేమ పన్నాలు వల్లించిన వ్యక్తి పసివాడిలా తల్లి కొంగుచాటున ముఖం దాచుకొని, మా అమ్మ ఇష్టం అన్నాడు. అతని మాటలతో నా ఒళ్లు మంటలెత్తింది. తిరిగి అతన్ని చూసింది కాని, అతనితో మాట్లాడేందుకు కాని అసహ్యమనిపించింది.

ఏప్రిల్-30 : రోజు రోజుకి అమ్మ వత్తిడి ఎక్కువ కాసాగింది.

నాన్నగారి గుండెపోటు నా పెళ్లి వెంటనే చెయ్యవలసిన అవసరాన్ని వేలెత్తి చూపించింది.

మే-7 : నేనొక నిశ్చయానికి రాకముందే పరిస్థితులు విషమించాయి. పెళ్లిని ఇక ఎంతమాత్రం వాయిదా వెయ్యలేనని తెలుసుకొన్నాను.

మే-8 : అవసరం అసహ్యాన్ని అణగతొక్కింది. అహంకారం చంపుకొని అతనితో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. ఆ కఠినశిల నా కన్నీటికి కరుగలేదు. ఆ పిరికితనానికి విరుగుడు లేదు.

మే-11 : గుండెని అదిమిపట్టుకొని అమ్మతో అంతా చెప్పాను. నా మాట విని అమ్మ గుండెలు బాదుకొంది. నన్ను తిట్టి, తన్ను తిట్టుకొంది. అమ్మని నాన్నగారు శాంతపరిచారు. రొష్టుపడితే నష్టపోయేది మనమే అని చెప్పారు.

మే-14 : నాన్నగారు పురోహితుని తీసికొని వరాన్వేషణకి బయలుదేరారు. మరి, నా అదృష్టం ఎలా వుందో!

మే-16 : వెళ్లిన పనిని జయప్రదంగా సాధించుకొని వచ్చారు నాన్నగారు. నా అదృష్టరేఖ మొదట్లో వక్రించినా సరిదిద్దబడుతుందనే హామీ నాన్నగారి మాటలవల్ల కలిగింది. సత్యనారాయణ మంచివాడే! ఆస్తి, అందం ఉన్నవాడే!

జూన్-12 : ఇల్లంతా పెళ్లి పనులతో హడావిడిగా ఉంది. ముహూర్తదినం దగ్గర పడుతున్నకొలదీ ఇంటికి, ఇంట్లో మనుష్యులకు కూడా పెళ్లికళ వచ్చినట్లుంది. నా ముఖం అద్దంలో చూసుకొంటే ఉండవలసిన ఉత్సాహం దానిలో లేదు. ఎన్నోసార్లు ఈ రోజుల్ని మనసులో ఎంతో సుందరంగా, మధురంగా ఊహించుకొని తీయని కలలు కంటూ ఆనందించాను. కాని ఆ ఆనందంలో శతాంశమైనా అనుభవించలేక పోయాను. దొంగతనంగా పాలు తాగిన పెంపుడు పిల్లిలా ఇంట్లో అందర్నీ తప్పుకు తిరగసాగాను.

జూన్-26 : సన్నాయి మేళగాళ్లు బయానా తీసుకొని కాస్తసేపు వాయించి వెళ్లిపోయారు. డోలుమీద దెబ్బ పడుతుంటే నా గుండెల మీద ఎవరో సుత్తితో కొట్టినట్లు అనిపించింది.

జూలై-10 : బితుకు బితుకు మంటున్న గుండెను అదిమి పట్టుకొని, కళ్లలోకి కాంతులు ఎరువు తెచ్చుకొన్నాను. పెదవులపై చిరునవ్వు సింగారించుకొన్నాను. నుదుట కళ్యాణపు బొట్టు. బుగ్గన దిష్టిచుక్క దిద్దుకొన్నాను.

వదినలు హారతులిచ్చారు. అన్నలు కానుకలు చదివించారు. నాన్నగారు నిండు మనసుతో ఆశీర్వదించారు. అమ్మ చెంబుడు వసంతం దిగతుడిచి పెరటి వెనుకగా పారబోసి వచ్చింది.

జూలై-11 : అంతా ఎదురు చూస్తున్న ఆరోజు వచ్చింది. విడిదిలోకి పెళ్లివారు వచ్చారు. చాలావరకు మగవాళ్లే. నలుగురైదుగురు ఆడవాళ్లు మాత్రం ఉన్నారుట. "అంతా స్నేహితులే. పెళ్లికొడుక్కి చుట్టాలెవరూ లేరుట" అంది పెద్ద వదిన.

జూలై-12 : కళ్లకి కాటుక, నుదుట తిలకం, బుగ్గచుక్కతో కళకళలాడుతున్న సత్యనారాయణ ముఖం చూస్తుంటే, పవిత్రమైన హోమాగ్ని శిఖలా కన్పించింది. అతణ్ణి నేనూ, నా తల్లిదండ్రులూ మోసం చేస్తున్నామనే ఆలోచన మనసులో కలుక్కు మంది.

విడిదిలో జరిగిన వేడుకల్లో కర్పూర పూసల హారం అతని మెడలో వేస్తుంటే, నా చేతులు వణికి అతని నుదుటికి కొట్టుకున్నాయి.

"ఇప్పటినుండే మొట్టికాయలు మొట్టే హక్కు లేదమ్మా పెళ్లికూతురా! రేపటి వరకు ఆగాలి" అంటూ పరిహాసం చేసారు అక్కడ చేరిన ముత్తయిదువులు.

భారంగా నా కళ్లు కిందికి వాలిపోయాయి. నామెడలో తను కర్పూర హారం వేస్తూ, కొంచెం ముందుకు వంగి, "కొత్తవాడినా రాధా! ఎందుకంత సిగ్గు? నారాయణ పెళ్లిలో నిలదీసి గంటల తరబడి వాదించినప్పటి అమ్మాయిగారి ప్రతాపం ఎక్కడికి వెళ్లిపోయింది? పల్లెటూరి పెళ్లికూతురిలా అలా తలదించుకొంటున్నావు" అన్నాడు మెల్లగా, కావాలని నా మెడని తాకుతూ.

"ఇప్పటినుంచి వధూవరుల మధ్య రహస్యాలు పనికిరావు. ఏది మాట్లాడినా అందరికీ వినబడేలా చెప్పాలి" ఈసారి అతని స్నేహితులు యాగీ చేసారు.

అతడి మాటలలోని లాలిత్యం, అతడి తాకిడిలోని అనురాగం నన్ను కృంగదీశాయి. నేను ఈ పెళ్లి చేసుకోలేను. అతడు అంత నిర్మలంగా తన చేతిని అందిస్తుంటే ఈ మాలిన్యంతో అగ్నిసాక్షిగా అందుకోలేను.

గంటలు గడిచిపోతున్నాయి. రాత్రి తెల్లవారుతుండగా లగ్నం. లగ్నానికి ముందుగా అతనితో కలిసి మాట్లాడాలన్నాను. అమ్మ నా నోరు నొక్కేసింది. "అవ్వ! ఇదేమిటే పాడు బుద్ధి? కుదుటపడుతున్న జీవితాన్ని కూలదోసుకుంటావుటే" అని మంద లించింది.

"నా జీవితం ఎలాగైనా సరే, అతనితో ముందుగా మాట్లాడందే ఈ పెళ్లి జరగదు. జీవితపర్యంతం ఈ బరువు నేను మొయ్యలేను. కాదని అడ్డగిస్తే నువ్వు పెళ్లికి సిద్ధం చేసిన పసుపు కుంకాలు నా శవానికే రాయవలసి ఉంటుంది" అన్నాను.

నా ఆవేశం చూసి అంతకే తెగిస్తానని అమ్మ హడలిపోయింది. నాన్నగారు ఏదో మాట్లాడాలనుకొంటున్నారనే మిషమీద అతన్ని ఇంటికి పిలిపించి నా గదిలో ప్రవేశ పెట్టింది.

ఆ గదిలో మామగారికి బదులుగా పెళ్లికూతురు ఉండడం చూసి అతడు ఆశ్చర్య పోయాడు. 'గట్టిదానివే! మత సాంప్రదాయాలనే తారుమారు చేద్దామని చూస్తున్నావు' అన్నట్లు నా వైపు చూసాడు.

"రండి కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలంటే అమ్మ ఈ అవకాశం కల్పించింది. ఈ పెళ్లి ఇంట్లో మన ఏకాంత సమావేశం అట్టే కాలం పొడిగించే అవకాశం లేదు. ఇది ఎంత త్వరలో ముగిస్తే మీకూ నాకూ అంత మంచిది. రేపటి మన వివాహానికి సంబంధించిన విషయం మాట్లాడాలనుకొంటున్నాను."

అటు తర్వాత ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తోచలేదు. ఏ ఆడదీ నోరు విప్పి కన్నతల్లి ముందైనా ధైర్యంగా చెప్పలేని మాటని పెళ్లికి ముందురోజు కాబోయే భర్తకి తెలియజెయ్యడం సామాన్యమైన విషయం కాదు. అతడు నా తడబాటు చూసి తనే మాట అందుకొన్నాడు.

"కట్నకానుకల విషయమా? కొంచెం ఇటూ అటూ అయినా నాకేం పట్టింపు లేదు. ఏపాటి లోటుపాట్లు వచ్చినా పెళ్లి పీటల మీద నుంచి రెక్క పుచ్చుకు లాక్కుపోయే పెద్దలెవ్వరూ నాకు లేరు" అన్నాడు.

అతడు అలా భావించడంలో తప్పులేదు. నిజ జీవితంలో ఇలా ఎంతవరకు జరుగుతున్నాయో చెప్పడం కష్టం కాని, సినిమాల్లో, కథల్లో ఇటువంటి సంఘటనలు కోకొల్లలుగా ఉంటున్నాయి.

"అటువంటిదేం కాదులెండి, నాన్నగారు అన్నమాటని తూ.చ. తప్పక ఆచరించా లనే రకం. ముందుగా కావలసిన కట్నం జాగ్రత్త పెట్టాకే పెళ్లి శుభలేఖలు అచ్చు వేయించారు" అన్నాను కాలి వేళ్లతో నేలను రాస్తూ, వాటి కదలికను చూస్తూ.

ఈ పెళ్లి నా కిష్టం లేదని చెప్పబోతున్నానని అతడు భావించి ఉంటాడు. అతని ముఖం కళారహితంగా ముడుచుకుపోయింది. "మరి?" అన్నాడు కుర్చీలో మరికాస్త ముందుకు వంగి కూర్చుంటూ. నిరాశ నిండిన అతని చూపులు నా పెదవుల కదలికకై వేచి ఉన్నాయి. నేను చెప్పబోయే మాటని అరగించుకొందుకు అతని మనసు ఆయత్తం చేస్తున్నది.

"నేను గర్భవతిని. రెండో మాసం" అంత మాత్రం చెప్పి ఊరుకొన్నాను.

నేనేం చెప్పేనో అర్థం కానట్లు క్షణం కాలం రెప్ప వేయకుండా నా వైపు సూటిగా చూసాడు అతడు. నామాట వినడానికి ముందు ఏదో చెప్పబోయేందుకు తెరచిన అతని నోరు అలాగే ఉండిపోయింది.

"ఈ విషయంలో నాన్నగారు, అమ్మ మిమ్మల్ని మోసం చేసారు. ఇటువంటి పరిస్థితిలో బిడ్డ క్షేమం కోరే ఏ తల్లిదండ్రులైనా ఇంకోలా ప్రవర్తిస్తారనుకోను. ఈ ఉదయం వరకు నేను కూడా వారి మాటకి ఊఁ కొట్టేను. విడిదిలో మిమ్మల్ని చూసాక ఇక వంచన చెయ్యడం నా వశంలో లేదని తెల్సుకొన్నాను. కట్టుకొన్న భార్య చేసిన మోసాన్ని

హరాయించుకొనే శక్తి మీలో లేదనిపించింది. అందుకే ఈ సమావేశం అవసరమయింది" అన్నాను.

అయిదు నిమిషాలు గడచినా అతని నోట మాటరాలేదు. మిడిగుడ్లతో, తెరచిన నోటితో స్థాణువులా అలాగే కూర్చున్నాడు. ఆ మౌనానికి అర్థం ఏమిటో నేను గ్రహించుకున్నాను.

"ఇప్పటికీ మించిపోయింది లేదు. ఈ వివాహం ఆగిపోయినా మీకేం నష్టం వాటిల్లదు. పెళ్లి చెడితే దోషం ఎవరికైనా, అవమానం అంతా ఆడపిల్లకే మిగిలి పోతుంది. ఇంక ఇటువంటి పరిస్థితుల్లో తప్పెవరిది అని అడిగే అవసరమే కలుగదు. అనవసరంగా మిమ్మల్ని శ్రమపెట్టాను. వెళ్లిరండి" అన్నాను. ఆఖరిమాట అంటుంటే నా గొంతుక వణికింది. మాట తడబడింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అతడు ఇంతకన్న ఉన్నత సంస్కార భావాలు కలవాడనుకొన్నాను. నా నిజాయితీని అర్థం చేసుకొని కనీసం రెండు సానుభూతి వచనాలైనా పలుకుతాడనుకొన్నాను. పురుషులపట్ల నా అంచనాలు సరిగా లేవని మరొక పర్యాయం రుజువయింది.

గది వైపు ఎవరో మాట్లాడుకొంటూ వస్తున్న అలికిడి అయ్యింది. అతడు కుర్చీలోంచి లేచి మెల్లగా గుమ్మంవైపు నడక సాగించాడు. ఉదయం అతడు నా మెడలో వేసిన కర్పూర హారం బరువనిపించి తీసి టేబులు మీద పడవేశాను. ఎదురుగా వున్న అద్దంలో నుదుట కళ్యాణ తిలకం చెమటకి కరిగి నెత్తురు చారలా ముక్కు మీదికి కారుతూ కన్పించింది.

తలుపులు దగ్గరికి వేసి గడియ బిగించి అతడు తిరిగి వచ్చాడు. వెళ్లిపోతున్నాడనుకొన్న మనిషి తిరిగి రావడంతో నేను తెల్లబోయి చూసాను. ఏమయిందన్నట్లు కనుబొమ్మలు ఎగుర వేసాను.

"ఎవరో ఇటు వస్తున్నట్లు అనిపించి, మన సంభాషణకి అంతరాయం అవుతుందని తలుపు వేసి వచ్చాను. మీకేం అభ్యంతరం ఉండదనుకుంటాను" అన్నాడు.

నేను అంగీకారాన్ని తెలియజేసాను. అతడు మాట్లాడడం మొదలుపెట్టాడు.

"మీరు చెప్పిన విషయం విని కొంతసేపు మతిపోయిన వాడిలాగ చూస్తూ కూర్చున్న మాట నిజమే. ఆ సమయంలో మిమ్మల్ని బాధపెట్టాలని కానీ, అవమానించాలని కానీ అలా ప్రవర్తించలేదు, ఆలోచనలో మునిగిపోయాను.

"ఈ వింత పరిణామంలో ఎలా ప్రవర్తిస్తే నా నిర్ణయం సరిగా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను. జీవిత భాగస్వామిని ఎన్నుకొనే సమయంలో దేనికెంత విలువ ఇయ్యవలసి ఉంటుందని కొలుస్తున్నాను.

"రాధా! మీరు చెప్పిన విషయం వివాహానికి ముందు రోజు ఏ వరుడూ తనకి కాబోయే వధువు నోట వింటాడనుకోడు. ఇటువంటి అవాంఛనీయ పరిస్థితులు పెళ్లిళ్లలో

అప్పుడప్పుడు బయటపడడం కద్దు. అది ఏ తలమాసిన దానాయి ద్వారానో పెళ్లివారికి తెలియడం, దానితో మగపెళ్లివారి బళ్లు తిరుగు ముఖం పట్టడం జరుగు తుంటుంది.

"కాని ఇక్కడి సంగతి అందుకు భిన్నంగా ఉంది. ముహూర్తం మూడు ఝాము లుందనగా, తన రహస్యం బయటపడేందుకు ఎటువంటి అవకాశం లేని సమయంలో వధువు తనంతట తాను కాబోయే భర్త ముందు నిలబడి చెప్తున్నది. ఇది ఏనాడు జరిగింది? ఇటువంటి పరిస్థితుల్లో ఎలా ప్రవర్తించాలో ఎక్కడ వ్రాసి ఉంది? ఇది నిజంగా ఒక పరీక్షా సమయం రాధా!

"మిమ్మల్ని వివాహమాడినా, మానినా ముందుగా మీ నిజాయితీని, మీ మనో ధైర్యాన్ని మెచ్చుకొంటున్నానని చెప్పక తప్పదు" అన్నాడు.

అతను చెప్పవలసింది ఇంకా పూర్తి కాలేదు. అతని అభిప్రాయం పూర్తిగా తెలియందే నేను బదులు చెప్పేందుకు ఏమీలేదు. రెండు క్షణాల తరువాత అతడు తిరిగి మాటను అందుకొన్నాడు.

"రాధా! పెళ్లికూతురు కోసం ప్రపంచాన్ని గాలించే పెద్దలెవరూ నాకు లేరు. మీతో కలిగిన కొద్ది పరిచయంలోనూ మిమ్మల్నేదో అర్థం చేసుకొన్నట్లు అనిపించింది. నేను నా భార్యలో ఉండాలనుకొంటున్న లక్షణాలు మీలో ఉన్నట్లు తోచింది. అందుకే మీ నాన్నగారు కోరిన వెంటనే నా సమ్మతి తెలియజేసాను. ఇప్పుడు ఈ కారణంగా మిమ్మల్ని కాదని త్రోసిపోతే నాకు అన్నివిధాల నచ్చిన ఇంకో పిల్ల దొరకవచ్చు, దొరక్కపోవచ్చు కూడా.

"నా మంచిని కోరి మీకు అవమానకరమైనా ఈ విషయాన్ని వివాహానికి ముందుగా తెలియజేసారు. అదే మనసుతో నాకు ఒక సలహా ఇవ్వగలరా రాధా!

"మనిద్దరం వివాహం చేసుకొంటే, ఈ కారణంగా మన వైవాహిక జీవితం కుంటుపడుతుందా? భార్యాభర్తల మధ్య ఉండవలసిన నైర్మల్యం నశిస్తుందా? ఇది ఏ విధంగా మన హాయికి ప్రతిబంధకం అవుతుంది?

"పెళ్లయేక మనకి మాత్రం పిల్లలు పుట్టరా? ఇది మాత్రం అందుకు భిన్నమయిందా? పరాయి బిడ్డ నా బిడ్డగా నా ఇంట్లో పెరిగినంత మాత్రాన, జీవన గతినే మార్చేటంత ఉపద్రవం ఏం జరుగుతుంది రాధా!" అన్నాడు అతడు నా రెండు చేతులు మృదువుగా పట్టుకొంటూ.

అతని మాట నా బ్రతుకుకి జీవం పోసింది. అతని సహృదయానికి నా మనసు జోహారు లర్పించింది. నెమ్మదిగా అతని చేతులు విడిపించుకొని శిరస్సు వంచి నమస్కరించాను.

"మీరు నాకు అటువంటి అవకాశమే కల్పించిననాడు, మన జీవితంలో ఈ విషయానికి ప్రాముఖ్యం రాకుండా చూసుకొంటాను" అన్నాను.

అతడు మెల్లగా నన్ను దగ్గరికి తీసుకొని, నుదుటి మీద ముద్దు పెట్టుకొన్నాడు. "మీ మాట మీద నాకు నమ్మకం ఉంది రాధా" అని చిరునవ్వు నవ్వుతూ వెళ్లిపోయాడు.

రాత్రి మంగళస్నానంతో నాలోని మాలిన్యం కడుక్కుపోయినట్లు అనిపించింది. గౌరిని ధ్యానిస్తూ నా మాటని నిల్పుకోగల్గే శక్తిని నాకు ప్రసాదించమని వేడుకొన్నాను.

◆ ◆ ◆

గతం తలపుకి రాకుండా రోజులు గడిచిపోవడం కష్టం. మంచి అయినా చెడు అయినా మనసులోంచి తొందరగా చెరిగిపోదు. జన్మదాతకి ప్రతిరూపంలా పుట్టాడు రవి. అలా జరగకుండా ఉంటే బాగుండునని ఆశించాను. అనుకొన్నవన్నీ అమరి పోతుంటే అది జీవితమే కాదు. ఒక సుందర స్వప్నం అవుతుంది.

కొడుకు పుట్టాడు. పార్టీ ఇయ్యమని సత్యం స్నేహితులంతా వెంటపడ్డారు. ఆ వత్తిడికి అట్టే కాలం తట్టుకోలేక సరే అన్నాడు సత్యం.

పార్టీకి వచ్చినవాళ్లంతా పిల్లడికి ప్రెజెంట్లు తెచ్చారు.

"ఏదయ్యా సత్యం నీ కొడుకు? మరీ ఘోషా స్త్రీలా ఇంట్లో దాచుకొంటే ఎలా? ఇలా బైటికి తీసుకురా, పుత్రోత్సాహానందం అంతా నువ్వు ఒక్కడివే జుర్రుకోవాలా! మమ్మల్నీ కాస్త రుచి చూడనీ" అంటూ గోల చేసారు మిత్రులు.

మూడు నెలలు నిండిన రవిని చిన్న రొజాయిలో ఉంచి సత్యం చేతిలో పెట్టాను. సత్యం రవిని ఎత్తుకోడం అదే మొదటిసారి. సాధారణంగా పసిపిల్లల్ని మగవాళ్లు చేతుల్లోకి తీసుకో సాహసించరు. రవిని ఎత్తుకోకపోవడానికి అదే కారణమో లేక అతని మనసులో ఇంకేమైనా ఉందో తెలుసుకోడం కష్టం.

పిల్లడిని అందుకొంటుంటే సత్యం చేతులు వణికాయి. నాలోని మాతృ మమత కంగారుపడి 'జాగ్రత్త' అని హెచ్చరించింది. 'నీ పిల్లడికి నా వల్ల ఏ ఆపదా రాదు రాధా' అన్నట్లు చూసాడు సత్యం.

కొడుకు.... కొడుకు అన్న మాటతో ఆ సాయంకాలమంతా సత్యం చెవులు గింగురుమన్నాయి. కొందరు రూపురేఖల్లో పోలికలు ఎంచారు. మరికొందరు తాతగారి పేరు పెట్టలేదేం అని ప్రశ్నించారు. అంతా వెళ్లిపోతూ, "నిన్ను మించినవాడు అవుతాడు నీ కొడుకు" అన్నారు.

అంతా పూర్తయేసరికి సత్యం శారీరకంగా, మానసికంగా అలసిపోయాడు. బట్టలైనా మార్చుకోకుండా తన గదిలోకి వెళ్లిపోయి తలుపులు వేసుకొని పడుకొన్నాడు. అతని క్షోభ నేను అర్థం చేసుకోగలను. అందుకే అతని ఏకాంతానికి అడ్డుపడలేదు.

రోజు రోజుకి రవి పెరుగుతున్నాడు. వారాలను, నెలలను దాటుకొని సంవత్సరాల లోకి వచ్చింది రవి వయస్సు. కాని సత్యానికి రవికి మధ్య దూరం మాత్రం పెరగలేదు, తరగలేదు.

రవిపట్ల సత్యానికి విముఖత లేదు. అసహ్యం, కోపం వంటి లక్షణాలు అతని ప్రవర్తనలో వెతికినా కనిపించవు. అతని మనసులో రవిపట్ల గల భావనకి ఒక నిర్వచనం చెప్పడం కష్టం. ఏ ముచ్చటైన ఆటవస్తువు కన్పించినా, మనసుకి నచ్చిన బట్టలు చూసినా రవి కోసం తెచ్చేవాడు.

రవి మూడేళ్లవాడు అయేసరికి ఒక పెద్ద పెట్టె నిండుగా వాడి బట్టలు, ఒక గది నిండుగా వాడి ఆటవస్తువులు తయారయాయి. ఒక్కొక్కసారి ఎందుకింత సొమ్ము ఖర్చు చేస్తారని వాదించేదాన్ని. అప్పటిమట్టుకి నా మాట మన్నించినట్టుగా ఊరుకొని, రెండు మూడు రోజులనాడు వాటిని కొని తెచ్చేవాడు సత్యం. రవి వాటితో నవ్వుతూ కేరుతూ ఆడుకొంటుంటే, "చూసేవా! ఎందుకు కొన్నారన్నావు. వాడెంత ముచ్చటగా ఆడుకొంటున్నాడో! అనేవాడు.

నా ముందు రవిని సత్యం ఎప్పుడూ ఎత్తుకోలేదు. అది గమనించనట్లే నేను నడుచుకునే దాన్ని. నేను ఇంటిపనిలో ఉండే సమయాల్లో ఒక్కొక్కసారి చేతుల్లోకి తీసుకొనేవాడు. నిద్రపోతుంటే వాడి ముఖంలోకి నిదానించి చూస్తూ దేనికోసమో వెతుకులాడేవాడు. ఆ క్షణంలో మనోభావాలు ఆకర్షణలో అతని కళ్లల్లో నాట్యమాడు తున్నట్లు ఉండేవి.

ఎవడికో పుట్టిన ఈ పిల్లాడు తన పేరు మీదుగా పెరుగుతున్నాడు. ఆ తండ్రి వంశ మర్యాదలేమిటో, బుద్ధులేమిటో, నీతి నిజాయితీలు ఏమిటో తనకి తెలియదు. రూపంతోపాటు అతని గుణాలు కూడా పుణికి పుచ్చుకొంటే, అవి మంచికే దారి తియ్యకపోతే? మరి ఆపైని ఆలోచించలేనట్లు రెండు చేతులతో కళ్లు మూసుకొని బయటికి వచ్చేసేవాడు. రవిని చేరదీయలేక, దూరంగా ఉంచలేక అతడు బాధపడు తున్నట్లు అనిపించేది నాకు.

కాలం కదలిపోతున్న కొలదీ సత్యం తన మనోభావాల్ని గుప్తంగా దాచుకోవడం నేర్చుకొన్నాడు. రాజు, పద్మ పుట్టాక అతను రవిని వేరుగా చూస్తున్నట్లు ఎప్పుడూ నాకు అనిపించలేదు.

రవి పుట్టగానే నేనొక నిర్ణయానికి వచ్చాను. రవి సత్యం వంశానికి వారసుడు కాడు. అతని ఆశయాలకి, సహృదయతకు, నిర్మల ప్రవర్తనకి అయినా వారసుడు అయేలా తయారు చెయ్యాలి. రవి మాటలలో, చేతలలో తన పోలికలు చూసుకొని, తమ మధ్య ఏదో అజ్ఞాన అనుబంధం వుండి వుంటుందని ముచ్చటపడే అవకాశం సత్యానికి కలిగించాలి అనుకొన్నాను.

రవి పెరిగి పెద్దవాడవుతుంటే నా ప్రయత్నాలు ఫలిస్తున్న పోకడలు కన్పించాయి. పిల్లలకు పెద్దలను అనుకరించాలనే కోర్కె సహజంగా ఉంటుంది. దానికితోడు తాము అనుకరిస్తున్నవారిపట్ల, వారి సామర్థ్యం పట్ల తిరుగులేని నమ్మకం కలిగితే ఇంక అడిగేందుకు ఏముంటుంది?

"మా నాన్న చిన్నప్పుడు బ్రహ్మరాక్షసుడిని చితకమొత్తి, వాడి కోరలు పీకి తెచ్చాడు. అవి మా అటక మీద ఇంకా ఉన్నాయి" అని పిల్లలు చెప్పుకొనే మాటల్లో గొప్పలు చెప్పుకొనే స్వభావం కాదు ఉన్నది. తండ్రి శక్తిలో వారికుండే అచంచల విశ్వాసం.

అటువంటి భావన తండ్రి పట్ల కలిగేలా రవిని తీర్చిదిద్దాలని ప్రయత్నించిన నా ఆశ ఒక విధంగా నెరవేరిందనే చెప్పవచ్చు. ఏ ఆలోచనకైనా, ఏ పని చెయ్యబోయినా తండ్రి అభిప్రాయం తీసుకోనిదే రవి ముందుకి పోడు. తండ్రి మాట జవదాటరాని గీతగా రవి భావిస్తాడు. ఎట్టి రహస్యాన్నైనా మనసు విప్పి చెప్పుకోగలంత ఆప్యాయత రవికి తండ్రి పట్ల ఏర్పడింది.

మాటలలో, చేతలలో తన ప్రతిబింబంలా పెరుగుతున్న రవిని చూసి సత్యం ఎంతో మురిసిపోతాడు. తిరిగి అంతలోనే దిగులు పడతాడు. "ఇదెలా సాధ్యం రాధా? మా ఇద్దరి మధ్య పోలికలెలా ఉంటాయి?" అంటూ నా ఫోటో ఎదురుగా నిలబడి ప్రశ్నిస్తాడు.

ఇదెలా సాధ్యమయిదో మీకు తెలియదు సత్యం, నాకు తెలుసు అనుకొంటాను.

రాధ చేతిలో డైరీ ఎప్పుడో మూసుకుపోయింది. గడచిన జీవితమంతా జ్ఞాపకాల సంపుటిలా ఆమె మనోదర్పణంలో ప్రతిఫలించింది.

◆ ◆ ◆

ఎనిమిది గంటలవేళ సత్యనారాయణ, రవి తిరిగి వచ్చారు. వారికి భోజనాలు పెట్టి తను సినిమా నుంచి రావలసిన రాజు, పద్మల కోసం కాచుకొని కూర్చున్నది రాధ. రవి ఏదో పుస్తకం పట్టుకొని తన గదిలోకి వెళ్ళిపోయాడు. తమలపాకులకు సున్నం రాసి చీల్చి, వక్కపొడి తీసుకొని తమ గదిలోకి వెళ్లింది రాధ. సత్యనారాయణ మంచం మీద వెల్లకిల పడుకొని ఏదో ఆలోచిస్తున్నాడు.

తమలపాకులు అందిస్తూ, "రవి ఏదో చెప్పాలంటూ పిలుచుకు వెళ్లాడు కదా, ఏం చెప్పాడేమిటి?" అంది.

రెండు నిమిషాల వరకూ సత్యనారాయణ మాట్లాడలేదు. భార్య చేతిలోని తమలపాకుల చిలకలు ఒక్కొక్కటి అందుకొని నోట్లో పెట్టుకోడంలో సమయం గడిపి వేసాడు.

జవాబు చెప్పని ప్రశ్నని రెట్టించి అడగడం రాధకి అలవాటు లేదు. ఖాళీ పళ్లెం తీసుకొని వెళ్లిపోబోతూంటే.... "నీ కొడుకు పెద్దవాడయేడు" అన్నాడు సత్యనారాయణ.

ఏడాదైె ఎమ్మెస్సీ పాసయి, రిసెర్చి చేస్తూ నేడో, రేపో విదేశాలకి పై చదువులకి వెళ్లాలని ఉబలాట పడుతున్న కొడుకు ఇంకా పసివాడని రాధ మాత్రం ఎలా అనుకొంటుంది? కాని ఆ విషయం ఆనాడే ప్రత్యేకంగా గ్రహించినట్లు సత్యనారాయణ మాట్లాడడంలో ఉన్న అంతరార్థం ఏమిటా అని ఆలోచిస్తూ నిలబడిపోయింది రాధ. రవి వయసు, రూపం క్షణకాలం రాధ మనసులో ఏవో తలపులు రేపి కలత పెట్టాయి. మళ్లీ అంతలోనే సంభాళించుకొని, 'ఛీ.... రవి అటువంటివాడు కాదు' అనుకొంది.

"రవి విదేశాలకి వెళ్లడానికి గట్టి ప్రయత్నాలే చేస్తున్నాడు. ఏదో ఒకటి కలసి రాకపోదు. ఈలోగా పెళ్లి చేసుకొని భార్యని కూడా వెంటబెట్టుకు పోవాలని వాడి ఉద్దేశం. ఆ మాట చెప్పేందుకే పిల్చాడు" అన్నాడు సత్యనారాయణ.

"ఎవర్నయినా ప్రేమించానంటున్నాడా? లేక మనల్ని చూసి పెళ్లి చెయ్యమంటు న్నాడా?"

"పెళ్లి మన అనుమతి లేనిదే జరగదనుకో. అయినా ప్రేమ వ్యవహారం వంటిదే."

"ఎవరిపిల్ల? ఏ ఊరు? పేరు కాని చెప్పాడా?

"ఈ ఊరే... అరుణ."

"అరుణా? అంటే ఆ మధ్య తన పుట్టినరోజునాడు పిలుచుకొచ్చాడు ఆ పిల్లేనా?"

"ఆc! ఆ పిల్లే. నీకు నచ్చలేదా?"

"నచ్చకపోవడం కాదు. ఇంటికి కోడలుగా తెచ్చుకోవలసిన పిల్లయొక్క మంచీ మర్యాదా తెలుసుకోవాలి కదా!"

"ఆ వివరాలన్నీ రవి చెప్పనే చెప్పాడు. అరుణ తండ్రి వ్యాపారస్తుడట. చాలా కాలంగా బెంగాలులో ఉండి ఇటీవలే ఈ ఊరు వచ్చారుట. బాగా డబ్బున్నవాళ్లు, మర్యాదస్తులు అన్నాడు రవి. అరుణ తన కాలేజీ చదువంతా ఇక్కడ హాస్టల్లో ఉండి చదువుకొందిట. చాలా కాలం నుంచి అరుణకి, రవికి స్నేహం ఉన్నట్లే ఉంది. తను వారింటికి మాత్రం ఒకటి రెండు సార్లకన్న ఎక్కువ పోలేదంటున్నాడు రవి" అన్నాడు సత్యనారాయణ విషయాన్ని వివరిస్తూ.

"మీరు ఆలోచించండి. మీకు సరియైనదే అనుకొంటే, నాకేం అభ్యంతరం లేదు. మంచి మర్యాద ఉన్న పిల్లలాగే ఉంది అరుణ. ఆ మధ్య మనింటికొచ్చినప్పుడు ఉన్న కాస్త సమయంలో 'ఆంటీ... ఆంటీ' అంటూ ఎంతో తియ్యగా మాట్లాడింది" అంది రాధ.

"మనల్ని తీసుకువస్తానని రవి వారితో చెప్పాడట. ఒకసారి వెళ్లి చూచి వచ్చాక మిగిలిన విషయాలు ఆలోచిద్దాం" అన్నాడు ఆవులిస్తూ సత్యనారాయణ.

గదిలో లైటు ఆర్పివేసి, తలుపు దగ్గరగా వేసి చావిట్లోకి వచ్చింది రాధ. 'నీ కొడుకు పెద్దవాడయేడు' అన్న సత్యనారాయణ మాట రాధ చెవుల్లో గింగురు మంటున్నది. ఇన్నేళ్లు గడిచినా, ఇంత జరిగినా సత్యనారాయణ రవి గురించి రాధతో మాట్లాడే సమయాల్లో 'నీ కొడుకు' అనే అంటాడు. రాధ పద్మ విషయంలో 'మీ కూతురు' అనడం కూడా కద్దు. కాని ఆ మాటలో తండ్రి, కూతుళ్ల పోలికలు ఒక్కలాగ ఉంటాయన్న భావం తప్పితే వేరే ఆలోచన లేదు.

కాని భర్త రవిని గూర్చి అలా అన్నప్పుడల్లా రాధ మనస్సులో కలుక్కుమంటుంది. బహుశ సత్యనారాయణ అటువంటి ఉద్దేశంతో అనకపోయి వుండవచ్చు. కాని రాధకిమాత్రం అతడు రవిని ఇంకా తన కొడుకుగా స్వీకరించలేదనిపిస్తుంది. సత్యం తన మనసులోంచి

ఆ విషయం ఏనాడో తొలగించాడేమో, తనే లేనిపోని అనుమానాలతో అనవసరంగా బాధపడుతున్నదేమో అని మనసుని సమాధానపెట్టుకో చూస్తుంది రాధ.

◆ ◆ ◆

అనుకొన్న విధంగా సాయంకాలం నాలుగింటికి బయలుదేరారు రాధా, సత్యనారాయణ, రవి, పద్మ. కారు దిగుతూనే అందరికన్నా ముందుగా ఇంట్లోకి నడిచాడు రవి. చావిట్లోనే ఎదురుకొంది అరుణ. ఆ పిల్లల ఆరాటం చూసి చిన్నగా నవ్వుకొంది రాధ.

అరుణ తల్లి మాధవి, నాయనమ్మ రాజ్యలక్ష్మీదేవి ఇంట్లో ఉన్నారు.

"నాన్నగారు ఏదో అర్జంటు పనిమీద ఊరుకి వెళ్లవలసి వచ్చింది. నాలుగయేసరికి వచ్చేస్తానన్నారు. ఈ పాటికి వస్తూనే ఉండాలి" అంది అరుణ.

మాధవి ఎంతో ఆదరంగా కుశల ప్రశ్నలు అడిగి కాఫీ, ఫలహారాలు అందించింది. వారు కాఫీలు తాగుతుంటే అరుణ నాయనమ్మ మాటలు ఇటు, అటు తిప్పుతూ తమ భోగట్టాలు వారికందించి వారి సంగతులు, ఆస్తిపాస్తుల వివరాలు సాకల్యంగా తెలుసుకొంది.

ఆడవాళ్ల మాటలు ప్రవాహ జలంలా సాగిపోతూంటే సత్యనారాయణ ఆ ఇంటిని, అలంకరణ రీతుల్నీ చూస్తూ రవి చెప్పినట్లు వీళ్ళు చాలా ధనవంతులే అనుకొన్నాడు.

అరుణ చక్కనిది. చదువుకొన్నది, పైగా తండ్రికి అవసరానికి మించిన ఆస్తి వుంది, ఒక్కతే ఆడపిల్ల, అన్నిటికీ మించి రవికి ఇష్టమైన సంబంధం. కాదని అడ్డు పెట్టేందుకు కారణాలు కనిపించలేదు. కులగోత్రాల పట్టింపులు తమకి లేవు. ముసలావిడ ప్రశ్నల్లో ఆ ప్రస్తావన రాకపోవడంచేత వారికీ లేవని నిర్ధారించుకున్నాడు సత్యనారాయణ. ఇంక మిగిలిందల్లా అరుణ తండ్రి నాథ్‌గారు రాగానే శుభం అనుకోవడమే తరువాయి అనుకున్నాడు.

రవిని కాస్త పక్కకి పిల్చి ఆ విషయమే తెలియజేసాడు. వారి సంభాషణ విన్న పద్మ తల్లి చెవిలో తండ్రి అభిప్రాయం ఊదింది. తనకూ అంగీకారమే అన్నట్లు చిరునవ్వు నవ్వింది రాధ.

మాధవికి, రాజ్యలక్ష్మీదేవికి కూడా ఆ సంబంధం నచ్చినట్లు వారి ముఖాలే చెప్తున్నాయి. అంతా గృహ యజమాని నాథ్‌గారి రాకకోసం ఎదురు చూస్తున్నారు.

అంతలో రావలసిన వ్యక్తి వచ్చినట్లు పోర్టికోలో కారు ఆగింది.

"అదిగో నాన్నగారు" అంది అరుణ ఉత్సాహంగా.

మాధవి లేచి ఎదురు వెళ్లింది.

నిండా నాలుగు నిమిషాలు గడువక పూర్వమే ఆమె తిరిగి వచ్చింది.

"నాథ్‌గారేనా?" సత్యనారాయణ ప్రశ్నించాడు.

"ఆఁ.... ఆయనే... దారిలో కారు టైరు పంక్చరయిందట. బట్టలు మార్చుకొని ఇప్పుడే వస్తున్నారు" అంది మాధవి.

ఒక్కసారిగా మాటలన్నీ ఒట్టిపోయినట్లు హాలంతా నిశ్శబ్దంగా ఉండిపోయింది. అందరూ నాథ్‌గారి రాక కోసం ఎదురు చూస్తున్నట్లు కూర్చున్నారు. నిండా అయిదు నిముషాలు గడువకముందే తెర తొలగించుకొని అతడు లోనికి వచ్చాడు.

"రా నాయనా జగన్నాథం! నీ కోసమే చూస్తున్నాము" అంది తల్లి ఆప్యాయంగా కొడుకుని ఆహ్వానిస్తూ.

కమ్మని గానంలో ఏదో అపశ్రుతిలా విన్పించింది రాధకి ఆ పిలుపు. రవి గౌరవంగా నమస్కరిస్తూ తనవాళ్లని పరిచయం చేసాడు.

"మా అమ్మగారు" అని రవి చెప్తుంటే రాధ చేతులు జోడిస్తూ కళ్లెత్తి చూసింది. క్షణకాలం ఆమె గుండె ఆగినట్లయింది. రెండు చేతులూ రెండంగుళాల దూరంలో అలాగే ఉండిపోయాయి. చూస్తుండగానే ఆమె కళ్లల్లో కాంతి తరిగి, నుదుటి మీద శ్వేద బిందువులు మిలమిల మెరిసాయి.

ఆశ్చర్యంగా ఆమె వంక నిదానించి చూసిన నాథ్‌గారు తొందరగా కోలుకొని మెల్లగా వెళ్లి సోఫాలో సత్యనారాయణ పక్కగా కూర్చున్నారు.

"రవీ.... నా ఒంట్లో సరిగా లేదు. తల తిరుగుతున్నట్లున్నది. డ్రైవర్ని కేకేయి నాయనా. నేను ఇంటికి వెళ్లి మీకు కారు తిరిగి పంపుతాను" అంది రాధ లేచి పోయేందుకు ప్రయత్నిస్తూ.

"ఏమయింది? ఏమయింది?" అంతా కంగారుగా రాధ దగ్గరికి వచ్చారు.

"గాభరా పడేందుకు ఏమీలేదు. ఒంట్లో కాస్త నలతగా ఉంది. నేను వెళ్లి వస్తాను. క్షమించాలి" అంటూనే డ్రాయింగు రూమ్ దాటి ముందు హాలులోకి వచ్చింది రాధ.

"మీరు కాస్తసేపు ఇలా ఈ మంచం మీద పడుకోండి. ఆ కాస్త మంచిమాట అనుకొన్నాక వెళ్లిపోదురు"గాని అంది అరుణ నాయనమ్మ.

"లేదు. నేను ఉండలేను. నన్ను అభ్యంతర పెట్టకండి" రాధ కాలు ముందుకి కదిపింది.

రవి అయోమయంగా తల్లిని చూసాడు. అంతవరకు అంత ఉత్సాహంగా మాట్లాడిన తల్లికి ఉన్నపళంగా ఏం ముంచుకొచ్చిందో అతడికి తెలియలేదు. అయిన దానికి కానిదానికి అంగలార్చే అలవాటులేని తల్లి అంతగా కంగారు పడుతున్నదంటే నిజంగా భరించరాని బాధే అనుభవిస్తున్నదనుకొన్నాడు.

పరిస్థితి అవగాహన చేసుకొన్న సత్యనారాయణ నెమ్మదిగా రాధ దగ్గరికి వచ్చాడు. "ఏమయింది రాధా?" అన్నాడు మెల్లగా ఆమె చెయ్యి అందుకొంటూ, అప్పుడే నీటిలోనుంచి

పూచిన కలువకాడలా ఉంది ఆమె చెయ్యి. రాధ కళ్లలోని వేదనని తెలుసుకోగలిగే చాకచక్యం ఒక్క సత్యన్నారాయణకి మాత్రమే ఉంది.

"మళ్లా వస్తాం నాథ్‌గారూ! ఈ పరిస్థితిలో రాధని ఒంటరిగా ఇంటికి పంపలేను" అన్నాడు సత్యనారాయణ గృహ యజమానితో.

"ఇప్పుడు ఆవిడకు వచ్చిన ఆపదేం లేదు. నీర్సంచేత ముఖం తిరిగి ఉంటుంది. కాస్త వేడి పాలు తాగి కళ్లు మూసుకొని పడుకొంటే సర్దుకొంటుంది!" అంది మాధవి.

"శుభకార్యానికి వచ్చి ఇలా తిరిగి వెళ్లిపోవడం మంచిది కాదు. తథాస్తు అన్నమాట అనుకొంటే మిగిలిన విషయాలు తాపీగా మాట్లాడుకోవచ్చు" అంది రాజ్యలక్ష్మీదేవి.

"పిల్లడి తల్లికి అలా వుండి వాళ్ళు కంగారు పడుతుంటే ఇప్పుడవన్నీ ఎలా జరుగుతాయమ్మా? మళ్ళా వస్తామంటున్నారు కదా" అన్నారు నాథ్‌గారు.

మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చి కారు ఎక్కాడు రవి. నీళ్ళు నిండిన కళ్ళతో వీడ్కోలు ఇచ్చింది అరుణ.

కారు దిగుతూనే తడబడుతున్న అడుగులతో మేడ మీదికి వెళ్ళిపోయింది రాధ. కింది సావిట్లో ఈజీ ఛైరులో కూలబడ్డాడు సత్యనారాయణ. రవి తల్లి వెనుకగా ఒక్కొక్క మెట్టూ లెక్కిస్తున్నట్లు మెల్లగా అడుగులు వేసుకుంటూ పైకి వెళ్ళాడు. తల్లికి వేడి పాలు తేవడానికి వంట యింట్లోకి వెళ్ళింది పద్మ.

రాధ అస్వస్థతకి కారణం గ్రహించుకొన్నాడు సత్యనారాయణ. మేడ మీద జరుగబోతున్న దృశ్యం అతని కళ్ళ ముందు కదిలింది. రాధని తలచుకొంటుంటే రెండు కన్నీటి బొట్లు అతని బుగ్గల మీదుగా జారిపడ్డాయి.

తల్లికి పాలు పట్టుకు వెళుతున్న పద్మ దిగాలుపడి కూర్చున్న తండ్రిని చూచి కంగారుపడింది. వారింట తిన్న ఏదో పదార్థం తల్లిదండ్రులిద్దరికీ వికటించి ఉంటుందని తలబోసింది. దగ్గరగా వెళ్ళి తండ్రి చేతులు పట్టుకొంటూ, "ఏమయింది నాన్నా!" అంది ఆత్రంగా. మెల్లగా కూతురు చెయ్యి పట్టుకొని తన పక్కగా కూర్చో పెట్టుకొన్నాడు సత్యనారాయణ.

"అమ్మకి ఈ పాలు ఇచ్చి వస్తాను" అంది పద్మ.

"కొంచెంసేపు ఆగి వెళ్దువుగాని. కూర్చో తల్లీ!" అన్నాడు.

మేడ మీద జరుగుతున్న సంభాషణ కూతురి చెవుల్లో పడడం అంత మంచిది కాదు. ఆ పరిష్కారం ఏదో తల్లీ కొడుకుల మధ్యనే జరగాలి అనుకొన్నాడు సత్య నారాయణ.

అరగంట గడువకముందే రవి కిందికి దిగి వచ్చాడు. అతడి ఒక్కొక్క అడుగు మెట్లపై ధ్వనిస్తుంటే రాధ జీవితం మీంచి అవమాన పిశాచపు రథచక్రాలు దొర్లుకుంటూ వెళ్లిపోతున్నట్లు అనిపించింది సత్యనారాయణకి.

రవి సావిట్లో అడుగు పెట్టేవరకు అతడి మూసిన కళ్ళు తెరవలేదు. రవిని ఏ రూపంలో చూడవలసి వస్తుందో, రాధ గురించి ఎటువంటి మాటలు వినవలసి వస్తాయో అనే శంక అతనిని కలవర పెట్టింది. "అమ్మకి పాలు ఇచ్చిరా పద్మా" అంటూ కూతుర్ని మాత్రం అంపకం పెట్టాడు.

పద్మ మెట్ల మీదికి చేరేవరకు తండ్రీ కొడుకులు మొఖాలు చూసుకొంటూ మౌనంగా ఉండిపోయారు.

"నాన్నగారూ!" అన్నాడు రవి నెమ్మదిగా.

ఆ కంఠంలో మార్పులేదు. ఆ పిలుపులో ఆప్యాయత లోపించలేదు. సత్యనారాయణ కుర్చీలోంచి ముందుకి లేచి కూర్చున్నాడు.

"అమ్మ అంతా చెప్పింది నాన్నగారూ" అన్నాడు రవి. 'అంతా' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

"నువ్వేమన్నావు రవీ?" ఆత్రంగా ప్రశ్నించాడు సత్యనారాయణ.

"మీ సాహచర్యంలో పెరిగిన నేను ఏమంటాను నాన్నగారూ?"

"ఇరవై ఏళ్లకి పూర్వం మీరేమన్నారో, ఈనాడు అమ్మతో అదే మాట చెప్పి వచ్చాను. మన జీవితాలను మార్చగల్గినంత శక్తి ఆ సంఘటనకి లేదు" అన్నాడు నిశ్చలంగా.

సత్యనారాయణ మనసు తేలికపడింది. గౌరవం నిండిన కళ్లతో కొడుకుని చూసుకొన్నాడు. పద్మ వెనుకగా రాధ మెల్లగా మెట్లు దిగుతూ వచ్చింది

పోస్టుమేన్ ఏదోకవరు తెచ్చి సత్యనారాయణ చేతిలో పెట్టాడు. ఇటు అటు తిప్పి ఎడ్రసు చూస్తుంటే, "ఎవరికేమిటి?" అని ప్రశ్నించింది రాధ.

"మనవాడికి ఏదో యూనివర్సిటీ నుంచి వచ్చింది. చూడు రవీ అందులో ఏముందో" అంటూ కవరు కొడుక్కి అందించాడు సత్యనారాయణ.

రవి ఉత్సాహంగా ఏమిటో చెప్తున్నాడు.

రాధ చెవుల్లో రవి మాటలు జొరలేదు. సత్యనారాయణ అన్న 'మనవాడు' అన్న మాట కమ్మని గానంలా రాధ చెవుల్లో మారుమ్రోగుతున్నది. ఆమె కళ్లలో నీళ్ల నిలిచాయి.

కాని అవి దుఃఖాశ్రువులు కావు.

ఆనంద భాష్పాలు!

కథా నిలయం
6423
శ్రీకాకుళం